

పేకాట స్థావరంపై దాడులు

నిమ్మనపల్లె మండలం బోయకొండ సమీపంలోని తోటలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. డ్రోన్ సాయంతో ఈ స్థావరాన్ని గుర్తించారు. -8లో



డీఎస్సీ నియామక ఉత్తర్వుల పంపిణీ వాయిదా

డీఎస్సీ నియామక ఉత్తర్వుల పంపిణీ వాయిదా పడింది. జిల్లా నుంచి కడపకు వెళ్లిన అభ్యర్థులు వెనుదిరిగి వచ్చారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.290
రెండోరకం	రూ.150	రూ.228



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 112 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీజీ	650	650
బైవోల్టిన్	-	-




మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 170.680 కిలోలు

న్యూస్‌రీల్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిద్ధం

రాయచోటి టౌన్: జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,87,238 స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కొత్త కార్డుల ద్వారా లబ్ధిదారుడు ఒక సారి తాను ఏ రకాల సరుకులు తీసుకొంటున్నాడనే విషయం తెలిసోతుందన్నారు. వీటిని ఈ నెల 30వ తేదీలోగా అందజేస్తామన్నారు. మిగిలిన కార్డులను కూడా రెండవ దశలో అందజేస్తామన్నారు. రేషన్ పంపిణీ సమయంలో సచివాలయ ఉద్యోగులు డిజిటల్ అంగీకారాన్ని (బయో మెట్రిక్, ఐరీస్, ఓటీపీ, ముఖ గుర్తింపు) తీసుకొని పంపిణీ చేయాలన్నారు. వీటిని జిల్లా, తాలూకా స్థాయిలో ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

రైతుబజార్‌లో ఉల్లి కిలో రూ.8



మదనపల్లె రూరల్: మదనపల్లెలోని రైతుబజార్‌లో ఉల్లిగడ్డలు (ఎర్రగడ్డలు) కిలో రూ.8కు విక్రయిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ టి.త్యాగరాజు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తగ్గిన ఉల్లి ధరలతో నష్టాలు చవిచూస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్రప్రభుత్వం రైతుబజార్ల ద్వారా ఉల్లిని విక్రయించాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా కర్నూలు నుంచి మదనపల్లె రైతుబజార్‌కు 4 టన్నుల ఉల్లిగడ్డలను తరలించిందన్నారు. వీటిని రైతుబజార్‌లో రాయితీపై కిలో రూ.8 చొప్పున విక్రయించడం జరుగుతుందన్నారు. బహిరంగ మార్కెట్లో ఉల్లి కిలో రూ.20కు పైగా అమ్ముడవుతోందని, రైతుబజార్‌లో రూ.8కు విక్రయిస్తున్న ఉల్లిని కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. డిమాండ్ మేరకు అదనపు నిల్వలు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


పారిశుద్ధ్య లోపంపై ఆగ్రహం



గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

సిద్దవటం: సిద్దవటం మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం సరిగా లేదని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దవటం గ్రామ పంచాయతీలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిలో గురువారం రోడ్డుకు ఇరువైపులా పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన రహదారిలోనే ఎక్కడ పడితే అక్కడ చెత్త, గడ్డి నిల్వలు, పేడ దిబ్బలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో చెత్త ఎత్తకపోతే ప్రజలు 1100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీఓ మైథిలి, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, పంచాయతీ రాజ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ప్రతినిధి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తత అవసరం



శిబిరంలో పశువులను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై

గాలివీడు: పశువుల్లో గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు పశు వైద్యులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం కుమ్మరపల్లెలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పశు గణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులను పరీక్షించి 35 ఎదకు రాని పశువులు, 25 పశువులకు సాధారణ పరీక్షలు, 62 పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. అలాగే గొంతు వాపు నివారణ టీకాలు వేయడం, దూడలకు నట్టల నివారణ మందులు తాపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు మాలకొండయ్య, సహాయ సంచాలకులు శివారెడ్డి, స్థానిక పశువైద్యులు నాగరాజు, సిబ్బంది శశికళ, లక్ష్మీనారాయణ, హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యపై ప్రైవేటు



- మదనపల్లె వైద్య కళాశాలకు 'టెండర్'
- పీపీపీ కింద కట్టబెట్టేందుకు ప్రకటన
- పేదలకు దూరం కానున్న ఉచిత వైద్యం
- పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా సీట్లు
- మదనపల్లె ప్రజల ఆశ నిరాశ



ఆగిపోయిన మదనపల్లె వైద్య కళాశాల భవనాల నిర్మాణ పనులు

సాక్షి రాయచోటి/మదనపల్లె: ప్రతి పేదవాడికి అత్యున్నత వైద్యం అందించాలన్న మహోన్నత సంకల్పంతో.. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా వైద్య రంగంపై దృష్టి సారించారు. రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించే వారికి కూడా అవకాశం ఉన్న మేరకు వనరులు కల్పించారు. ఒకపక్క పేద ప్రజలు, మరోపక్క సంక్షేమం అందిస్తూనే.. ఇంకోపక్క పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా అనేక చర్యలు చేపట్టారు. అయితే కాలం మారింది.. 2024లో కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. 2024 జూన్ నుంచే విద్యా సంవత్సరం ప్రారంభించాలని ఏర్పాట్లు చేసుకున్నా.. చంద్రబాబు తీసుకున్న చర్యలతో సీట్లు వెనక్కి పోవడం జరిగింది. దీతో తరగతులే కాకుండా మెడికల్ కళాశాలపై కూడా నీలినీడలు అలుముకున్నాయి. అంతేకాకుండా గోరుచుట్టుపై రోకలిపోటులా ప్రస్తుత సర్కార్ పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టిషిపేషన్) విధానం తీసుకు రావడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్గిమీద గుగ్గిలమవుతోంది. అంతేకాకుండా కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ శుక్రవారం జిల్లాలోని మదనపల్లె మెడికల్ కళాశాలను సందర్శించడానికి చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం తలపెట్టారు.

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా..

నీట్ పరీక్షలో ఎంత ర్యాంకు వచ్చినా.. ఎంత ప్రతిభ కలిగిన విద్యార్థులైనా సరే.. ప్రయివేటు వైద్య కళాశాలలో కంటే ప్రభుత్వ వైద్య కళాశాల్లోనే చదివేందుకు ఇష్టపడతారు. ఎందుకంటే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వస్తే వేలల్లో ఫీజు ఉంటుంది. అదే ప్రైవేటు కళాశాలలో చదివితే ఫీజు లక్షల్లో ఉంటుంది. ఇది పేద ప్రతిభ కలిగిన విద్యార్థుల వైద్య విద్యకు చాలా అవరోధం. దీనివల్ల వైద్య విద్య చదవాలనుకుంటున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవాలన్న ఆశ ఉంది. అలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేసింది. అందులో మదనపల్లె ఒకటి. భౌగోళికంగా, ఈ ప్రాంత ప్రజల స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ఇక్కడ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక మెడికల్ కళాశాల అవసరం ఉందని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి గుర్తించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కళాశాల మంజూరు చేయించారు. దీంతో మదనపల్లె ప్రజలు తమకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని సంతోషపడ్డారు. పూర్తి స్థాయి కళాశాల ఆరంభమయ్యాక ఇక వైద్యం కోసం పరుగులు తీయాల్సిన అవసరం లేదన్న ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ ఆశల్ని కూటమి ప్రభుత్వం మొగ్గలోనే తుంచేసింది.

టెండర్లకు ప్రకటన: తొలి విడతలో నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం కోసం ప్రభుత్వం గురువారం ప్రకటన జారీ చేసింది. ఆదోని, మార్కాపురం, పులివెందులతోపాటు మదనపల్లె వైద్య కళాశాలను పీపీపీ కింద అభివృద్ధి చేయడం కోసమని ప్రకటించారు. ఇందులో 150 యూజీ సీట్లు, 24 పీజీ సీట్లు, 625 పడకలతో వైద్య కళాశాల అభివృద్ధి కోసం చేపట్టిన ప్రాజెక్టుగా ప్రకటిస్తూ.. ఏపీఎంఎస్ఐడీసీ టెండర్లను ఆహ్వానించింది.

వైద్య సేవల కోసం దూరప్రాంతాలకు..

మదనపల్లె వైద్య కళాశాల మంజూరైనప్పటి నుంచి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారు. 80 మంది వైద్యులతో వైద్యంతోపాటు శస్త్ర చికిత్సలు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్యుల సంఖ్య 17కు పడిపోయింది. వైద్య సేవలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ పరిస్థితుల్లో వైద్య కళాశాల ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగుతుందని, దీనిపై ఆధారపడిన తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల చెందిన ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. గతంలో వైద్యం కోసం తిరుపతి, బెంగళూరు, వేలూరు వెళ్లేవారు. వైద్య కళాశాల కారణంగా దూర ప్రాంతాలకు వెళ్లే రోగుల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం వైద్యులు, నిపుణుల సంఖ్య తగ్గిపోవడంతో వైద్య సేవల కోసం మళ్లీ దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

భారీ ఫీజులు

మదనపల్లె వైద్య కళాశాలను పీపీపీ కింద ప్రైవేటుకు కట్టబెడితే ఉచిత వైద్యం, వైద్య విద్య సీట్లు పేదలకు దూరం చేసినట్టే. ప్రైవేటు భాగస్వామ్యం కారణంగా మెడికల్ సీట్లను పేద విద్యార్థులు దక్కించుకోవడం కష్టమవుతుంది. వారు నిర్ణయించిన ఫీజును చెల్లించాల్సిన పరిస్థితి వస్తుంది. దీని ఫలితంగా పేద విద్యార్థుల వైద్య విద్య కల సాకారం కలగానే మిగిలిపోతుంది. అలాగే వైద్యం కూడా ఖరీదుగా మారుతుంది. ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవచ్చు. ప్రతి వైద్యానికి ఫీజు నిర్ధారణ చేసే అవకాశం ఉంది.

ఏడాదిన్నరగా ఆపేసి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మదనపల్లె సమీపంలోని శానిటోరియం వద్ద 95 ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం రాకతోనే ఆగిపోయాయి. ఏడాదిన్నరగా పనులు సాగలేదు. ప్రధాన భవనం, టీచింగ్ హాస్పిటల్, వసతి గృహాలు, జూనియర్, సీనియర్ రెసిడెంట్స్ భవనాలు, నర్సింగ్ కళాశాల భవనం, విద్యార్థినులకు ప్రత్యేక వసతి భవనం, నర్సింగ్ సిబ్బందికి నివాస గృహ భవనాలు, వైద్య కళాశాల నిర్వహణ వ్యర్థాలకు, హాస్టల్ వంటగది, డైనింగ్ హాలు, డ్రగ్గార్, మార్చురీ గది, ల్వికిడ్ ఆక్సిజన్ ప్లాంట్, విద్యార్థులకు లైబ్రరీ, టీరింగ్ గదులతో కలిపి 23 భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉండగా... కళాశాల ప్రధాన భవనం, విద్యార్థిని, విద్యార్థులకు హాస్టల్ భవనాలు, ఓపీడీ భవన నిర్మాణ పనులు 70 శాతం పైగా పూర్తి చేశారు. కిచెన్, డైనింగ్, సెంట్రల్ లైబ్రరీ తదితర భవనాల నిర్మాణాల కోసం భూమి లోపలి పనులు పూర్తి చేసి పిల్లర్ల పనులు చేపట్టారు. ఈ పనులు ఏడాదిన్నర కాలంలో యథావిధిగా కొనసాగి ఉంటే.. నిర్మాణాలు పూర్తి దశకు చేరుకునేవి. అయితే ప్రభుత్వం పనుల పూర్తికి ఆసక్తి చూపకపోవడంతో మదనపల్లె వైద్య కళాశాల నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో రూ.475 కోట్ల విలువైన పనుల్లో రూ.80 కోట్ల పనులే పూర్తి చేయగలిగారు.

కూటమి సర్కార్ గ్లోబెల్స్ ప్రచారం

రాష్ట్రంతోపాటు జిల్లాలో మెడికల్ కళాశాల భవనాలు దాదాపు పూర్తయి తరగతులకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో.. కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది. అయితే వాస్తవాలను విస్మరిస్తూ టీడీపీ గ్లోబెల్స్ ప్రచారానికి తెర తీయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ ఎక్కడా లేని రీతిలో కూటమి సర్కార్ కొత్త కొత్త పంథాన్ని అనుసరిస్తూ ఏదో ఒకరకంగా విష ప్రచారానికి తెర తీస్తుండటాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా తప్పుబడుతోంది.

నేడు చలో మెడికల్ కళాశాల

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాక
- 17 నియోజకవర్గాల నుంచి తరలివస్తున్న నేతలు
- వైద్య కళాశాల వద్ద నిరసన



మదనపల్లె ప్రభుత్వ వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మదనపల్లె సమీపంలోని శానిటోరియం వద్ద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 95 ఎకరాల్లో వైద్య కళాశాల నిర్మాణం చేపట్టింది. ఈ కళాశాలను ప్రైవేటుకు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. వీరంతా మెడికల్ కళాశాల వద్దకు చేరుకుని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన భవనాల నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అక్కడే నిరసన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ ప్రైవేటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తారు. భారీ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు తరలివస్తున్నారు.

వాన.. వెల్లువాయె!

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- రెండు రోజులుగా.. మోస్తరుగా..
- వర్షాధార పంటలకు ఊతం



పింఛా ప్రాజెక్టు నుంచి దిగువకు పారుతున్న నీరు

రాయచోటి: అల్పపీడన ప్రభావంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తారుకు పైగా వర్షం కురిసింది. రెండు రోజులుగా రాత్రి వేళల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుండటం వర్షాధార పంటలకు ఊతమైంది. జిల్లాలోని 23 మండలాల్లో మోస్తరు వర్షం కురవగా మిగిలిన ఏడు మండలాల్లో చిరుజల్లులతో సరిపెట్టుకుంది. మామిడి, బొప్పాయి, కర్బూజా, వరి, వేరుశనగ, టమాటా, ఇతర కూరగాయలు, పూల తోటలకు ఈ వర్షం రాక ఎంతో ఊరటనిచ్చింది. చీడపీడలతో ఉన్న వరిపంటకు కలిసి వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని తంబళ్లపల్లెలో 86.2 మిమీ వర్షపాతం, సంబేపల్లిలో 83.6 మిమీ వంతున అధికంగా వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయానికి పెనగలూరు, చిట్వేలి, రాజంపేట, ఓబులవారిపల్లి, కోడూరు, కురబలకోట, పీలేరు, కలకడ మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షం (మిమీ)
పెద్దమండెం	50.6
చిన్నమండెం	46.6
గుర్రంకొండ	45.8
బి.కొత్తకోట	32.2
పెద్దతిప్పసముద్రం	31.6
ములకలచెరువు	26
రామాపురం	25.6
వీరబల్లి	25.4
రాయచోటి	24.8
లక్కిరెడ్డిపల్లి	23
పుల్లంపేట	20.6
నిమ్మనపల్లి	19.2
టి.సుండుపల్లి	15.4
రామసముద్రం	13.2
గాలివీడు	12.8
మదనపల్లి	9.2
నందలూరు	7.4
వాల్మీకిపురం	7.2
కేవీ పల్లి	6.4
కలికిరి	3.2

పొంగుతున్న ప్రాజెక్టులు



నిండుకుండులా చిన్నేరు ప్రాజెక్టు

తంబళ్లపల్లె మండలంలో బుధవారం రాత్రి కురిసిన 86.2 మి.మీ భారీ వర్షానికి ప్రాజెక్టులు నిండి మొరవ పారుతున్నాయి. 2006లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి కృషి ఫలితంగా చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టులు నిర్మించారు. అప్పటి నుంచి ఈ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ఈ ఏడాది మళ్లీ మొరవ పోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుల వైపు ఇరిగేషన్ శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదని, అభివృద్ధి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు కూడా కాలువల నిర్మాణాలు చేయలేదు. కాలువలకు తీసుకున్న భూములకు సైతం నష్టపరిహారం చెల్లించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు పూర్తయివుంటే సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందేది. ఈ ప్రాజెక్టులలో పలు రకాల చేపలు అభివృద్ధి చెందాయి. రెండు ప్రాజెక్టుల కట్టలపై కంపచెట్లు కమ్ముకుపోయి కట్టలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించాల్సి ఉంది. –తంబళ్లపల్లె

ఇళ్లలోకి నీరు

సిద్దవటం మండల పరిధి టక్కోలు గ్రామం ఎస్సీ కాలనీలోని రహదారులు జలమయమయ్యాయి. వర్షం నీరు ఎటూ పోలేక నివాస గృహాల్లోకి వెళ్లడంతో.. తమ సామగ్రి అంతా తడిసిపోయిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు నిల్వ ఉండటంతో రాత్రి వేళల్లో దోమలు, విష పురుగులు సంచరిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామలింగరాజును వివరణ కోరగా ఎస్సీ కాలనీలో ఒక వ్యక్తి వర్షపు నీరు పోకుండా గోడ నిర్మాణం చేశాడని, సమస్య పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పరిష్కారం చేస్తామన్నారు. –సిద్దవటం



టక్కోలు ఎస్సీ కాలనీ రహదారిలో నిల్వ ఉన్న నీరు

రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

సుండుపల్లె మండలంలో రెండు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. ఊటచెరువు నిండి మొరవలో నీరు అధికంగా వస్తోంది. దీంతో మండల కేంద్రం నుంచి గుండ్లపల్లికు వెళ్లే రహదారి వడ్లపల్లె సమీపంలో.. ప్రధాన రహదారిపై తూముల దగ్గర మట్టి రోడ్డుపైన నీరు అధికంగా వచ్చి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ మెహబూబ్‌చాంద్, పోలీసు సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించారు. వాహనదారులు, ప్రజలను అటువైపు వెళ్లనీయకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహం ఇలాగే ఉంటే రోడ్డు తెగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు తెలిపారు. –సుండుపల్లె

మాండవ్యనదిలో జలసవ్వడి



చిన్నమండెం మండల పరిధిలోని మాండవ్యనది జలకళ సంతరించుకుంది. నదికి భారీగా నీరు వచ్చింది. నీటి ప్రవాహం వేగంగా సాగుతోంది. – చిన్నమండెం

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పీలేరు: జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీలేరు నియోజకవర్గంలోని అన్ని శాఖల నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని సర్పంచ్ హబీబ్‌బాషా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే 12 నెలలుగా ఆర్‌వో ప్లాంట్ల వాటర్‌మెన్లకు జీతాలు ఇవ్వలేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు, డీపీవో రాధమ్మ, జీఎస్‌డబ్ల్యూ ఎస్.లక్ష్మీపతి, నియోజకవర్గంలోని మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి నియోజకవర్గ ప్రగతికి చర్యలు

రాయచోటి: రాయచోటి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకునేలా శాఖల వారీగా ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో రాయచోటి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగునీరు, తాగునీటిపై సమీక్ష చేసి, నియోజకవర్గంలోని చిన్న మధ్య తరహా ప్రాజెక్టులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళ మృతి


శోభారాణి (ఫైల్)

కలకడ : ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. కలకడ పోలీసుల వివరాల మేరుక. వాల్మీకిపురం మండలం దయ్యాలబండ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకటరమణ భార్య శోభారాణి(34) తన వ్యక్తిగత పనులపై ఈ నెల 14న కలకడకు వచ్చింది. తిరుగుప్రయాణంలో ఇతరుల ద్విచక్ర వాహనంలో(లిఫ్ట్) వెళ్తుండగా.. కదిరాయచెర్వు వద్ద రోడ్డుపై వేగ నిరోధకం వద్ద వాహనం అదుపు తప్పి తలకు తీవ్రగాయమైంది. ప్రమాదంలో గాయపడ్డ శోభారాణిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. మృతురాలి తమ్ముడు శబరీష్ ఫిర్యాదుమేరకు హెడ్ కానిస్టేబుల్ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం విక్రయించడం నేరం


లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

పుల్లంపేట : రేషన్ బియ్యంను ప్రజలు విక్రయించటం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ పుల్లారెడ్డి అన్నారు. మండలంలోని జాగువారిపల్లి పొలిమేరలో గురువారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ బురదలో ఇరుక్కుపోయింది. ప్రజలు గుర్తించి పుల్లంపేట తహసీల్దారు పుల్లారెడ్డికి సమాచారం అందించారు. రైల్వే కోడూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసులు తనిఖీచేశారు. కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన ఈ లారీని బీదర్ జిల్లా వంగూరు గ్రామానికి చెందిన క్రాంతికుమార్ డ్రైవింగ్ చేస్తున్నట్లు తెలియజేశారు. అందులో 50 కిలోల బియ్యం బస్తాలు 309 ఉన్నట్లు శ్రీనివాసులు తెలియజేశారు. బియ్యాన్ని రాజంపేట స్టాక్ పాయింట్‌కు తరలించి లారీని సీజ్ చేశారు. కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

16 బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం


పేకాట స్థావరంపై దాడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేంద్ర


మామిడితోటలోని పేకాటస్థావరం

మదనపల్లె రూరల్ : డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి నిమ్మనపల్లె మండలం బోయకొండ సమీపంలోని మామిడి తోటలో పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.55 వేల నగదు 16 ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కే.మహేంద్ర తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లె మండల సరిహద్దులో పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో డ్రోన్ సాయంతో జూద స్థావరాన్ని గుర్తించామన్నారు. ఎస్ఐలు రహీముల్లా, అన్సర్ బాషాల బృందం దాడులు నిర్వహించి మదనపల్లెకు చెందిన ఈ.శ్రీనివాసులు, వి.శ్రీరాములు, కలికిరికి చెందిన వెంకటరమణ, పుంగనూరుకు చెందిన అక్కులప్ప, రెడ్డెప్పనాయక్, హరిలను అరెస్ట్ చేశారన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా పేకాట ఆడినా, నిర్వహించినా సాంకేతికత సాయంతో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ములకలచెరువు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అన్సర్‌బాషా, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో జూదగాళ్లపై పోలీసుల నిఘా

రాయచోటి : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేలా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి నిర్ణయం పేకాట రాయుళ్ల గుండెల్లో గుబులు రేపుతోంది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపే కార్యక్రమానికి ఎస్పీ పూనుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో విచ్చలవిడిగా పేకాట, ఇతర జూదాలు, అసాంఘిక కార్యక్రమాలు జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న సమయంలో ఎస్పీ నిర్ణయం జిల్లా ప్రజలకు కొంత ఊరటనిస్తోంది. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ఆధునిక టెక్నాలజీ వాడుతున్నారు. పేకాట స్థావరాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో డ్రోన్ల సాయంతో పారిపోతున్న వారిని పట్టుకోవడం సులభతరంగా మారింది. డ్రోన్ కెమెరాల సహాయంతో జూదం, బహిరంగ మద్యపానం లాంటి చట్ట వ్యతిరేక పనులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే నిమ్మనపల్లి అటవీప్రాంతంలో చేపట్టిన డ్రోన్ల ద్వారా చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైనట్లు పోలీసులు తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని వదిలిపెట్టరాదని ఎస్పీ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఎక్కడైనా అసాంఘిక సంఘటనలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిస్తే సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్పీ జిల్లా ప్రజలకు సందేశం ఇచ్చారు.

డీఎస్సీ నియామక ఉత్తర్వుల పంపిణీ వాయిదా


కడపకు చేరుకున్న డీఎస్సీ అభ్యర్థులు

మదనపల్లె సిటీ : మెగా డీఎస్సీ నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం వాయిదా పడింది. జిల్లా నుంచి మెగా డీఎస్సీలో ఎంపికైన వారిని గురువారం ఉదయం కడప ఆర్ట్స్ కాలేజీ చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సందేశాలు పంపారు. అక్కడి నుంచి విజయవాడలో శుక్రవారం జరిగే కార్యక్రమానికి తీసుకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. దీంతో నాన్ లోకల్ కింద ఎంపికైన వారు సుదూర ప్రాంతాల నుంచి కడపకు చేరుకున్నారు. ఉద్యోగం కావాలంటే నీవే కాదు తోడుగా ఒకరిని తప్పక తీసుకురావాల్సిందేనని ఆదేశించారు. దీంతో చిన్నపిల్లల తల్లులు, గర్భవతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఎంతో వ్యయప్రయాసాలకు ఓర్చి వెళితే వాతావరణ పరిస్థితుల కారణంగా వాయిదా వేసినట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. చేసేది లేక అభ్యర్థులు వెనుదిరగాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వ తీరుపై పలువురు మండిపడుతున్నారు.

సాల్ట్ పథకంతో విద్యా రంగం నిర్వీర్యం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాజంపేట టౌన్ : సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్సఫర్మేషన్(సాల్ట్) పథకంతో విద్యా రంగం నిర్వీర్యం అవుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వతేదీ నుంచి 19వతేదీ వరకు నిర్వహిస్తున్న యూటీఎఫ్ రణభేరి కార్యక్రమంలో భాగంగా రాజంపేటలో పాల్గొన్నట్లు తెలిపారు. సాల్ట్ పథకంతో పాఠశాల పనిదినాల్లో శిక్షణ ఇస్తున్నారని, అనేక రకాల బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులపై రుద్దుతున్నారన్నారు. ఈ పథకానికి గణాంకాలను ఇవ్వడం కోసం, గిన్నీస్ రికార్డుల కోసం ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేయడం తగదన్నారు. బోధనేతర కార్యక్రమాల బాధ్యతలను ఉపాధ్యాయులు చేస్తుండడంతో విద్యార్థులకు మెరుగైన బోధన చేయలేకపోతున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని కోరారు. 2023 జూలైలో నియమించాల్సిన 12వ పీఆర్సీ ఛైర్మన్‌ను ఇప్పటికీ నియమించలేదని, నాలుగు డీఏలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం ఒక్కరోజు చర్చించలేదని తెలిపారు. అంతకు ముందు బోయినపల్లె నుంచి ఎన్‌జీఓ హోం వరకూ యూటీఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.లక్ష్మీరాజ, ఎస్.జయచంద్రారెడ్డి, బిళ్లా హరిప్రసాద్, జాబీర్, చెంగల్‌రాజు, వెంకటసుబ్బయ్య, రమణమూర్తి, నాగేంద్ర, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

చదవలేదని పంపేశారంటూ విద్యార్థి ఫిర్యాదు


సబ్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, తల్లిదండ్రుల నిరసన

మదనపల్లె రూరల్ : చదువురాని విద్యార్థులు పాఠశాలకు అక్కర్లేదని వివేకానంద హైస్కూల్ హెచ్ఎం రాజేంద్రబాబు తనను పాఠశాల నుంచి పంపేశారని పదోతరగతి విద్యార్థి లోకేష్ తల్లిదండ్రులతో కలిసి సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణికి ఫిర్యాదు చేశారు. స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట హెచ్ఎం రాజేంద్రబాబు తీరుపై తల్లిదండ్రులు, బీఎస్పీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. లోకేష్ తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పది మంది విద్యార్థులను చదువులో వెనుకబడ్డారని దుర్భాషలాడి హెచ్ఎం ఇంటికి పంపేశారన్నారు. తాము వెళ్లి హెచ్ఎంను నిలదీయడంతో చదువురాని విద్యార్థులు పాఠశాలకు వద్దని అసభ్యంగా తిట్టారన్నారు. తమ బిడ్డల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు. హెచ్ఎం రాజేంద్రబాబు వివరణ ఇస్తూ... ఆగస్టు 13వ తేదీ నుంచి లోకేష్ పాఠశాలకు రాలేదని, తల్లిదండ్రులకు విషయం తెలిపినా పట్టించుకోలేదన్నారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు రాకుంటే పాస్ కాలేరని మాత్రమే చెప్పానని, విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మిద్దెపల్లె బాలాజీ, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాయచోటి : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పది మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గత వైఎస్సీపీ ప్రభుత్వం ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ పెట్టి సామాన్యులకు సైతం మెడికల్ కోర్సులు అందుబాటులోకి తెచ్చే విధంగా 17 కాలేజీలను మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తి ప్రైవేటీకరణకు పూనుకోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత వైద్యం అందకుండాపోతుందన్నారు. వెంటనే 107, 108 జీఓలను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లి మెడికల్ కాలేజీకి స్థలం కేటాయించి గత ప్రభుత్వం రూ.390 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో రూ.20 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మెడికల్ కళాశాలను నేడు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడమంటే వైద్య రంగం కేవలం కార్పొరేటర్ల కోసమేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి మణి, రామాంజులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల కుటుంబాలను ఆదుకోవాలి


విలేకర్లతో మాట్లాడుతున్న వంగిమళ్ల రంగారెడ్డి

రాయచోటి టౌన్ : దివ్యాంగుల కుటుంబాలను ఆదుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో రూ.3వేలు ఉన్న పెన్షన్‌ను కూటమి ప్రభుత్వం రూ.6వేలకు పెంచిందన్నారు. రూ.10 వేలుగా ఉన్న పెన్షన్ రూ.15 వేలకు పెంచడంతో దివ్యాంగుల కుటుంబాలు ఎంతో సంతోషించారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఏవో సాకులు చూపుతూ సర్వే పేరుతో పెన్షన్లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం బోగస్ సర్టిఫికెట్లు తొలగించమని చెప్పితే వైద్యులు మాత్రం అందుకు భిన్నంగా అర్హత కలిగిన వారందరినీ తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం దృష్టి పెట్టి దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు.

మద్యం మత్తులో బిడ్డలపై తల్లి దాడి



గాయపడిన పిల్లల అమ్మమ్మ అనసూయ, పిల్లలు

మదనపల్లె రూరల్ : మద్యం మత్తులో కన్నబిడ్డలపై తాగుబోతు తల్లి దాడి చేసి, భయభ్రాంతులకు గురిచేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన లక్ష్మన్న, వాణి దంపతులు. వీరికి కిరణ్‌కుమార్(13), రుషి(12) ఇద్దరు సంతానం. కొంతకాలం క్రితం లక్ష్మన్న యాక్సిడెంట్ కేసులో జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో వాణి మద్యానికి బానిసైంది. మద్యం తాగిన ప్రతిసారీ ఇంట్లో గొడవచేస్తూ కన్నబిడ్డలను విచక్షణారహితంగా కొట్టేది. బుధవారం రాత్రి ఫుల్లుగా మద్యం తాగిన వాణి మరోసారి బిడ్డలు కిరణ్‌కుమార్, రుషిపై దాడిచేసి కొట్టింది. అడ్డుకోబోయిన తల్లి అనసూయపై దాడికి పాల్పడింది. దీంతో భయపడిన పిల్లలు ఇంటి నుంచి కేకలు వేసుకుంటూ బయటకు పరిగెత్తుకు వెళ్లి ఇద్దరు యువకులను కాపాడాల్సిందిగా అభ్యర్థించారు. ఇంతలో వాణి అక్కడకు చేరుకుని పిల్లలపై మరోసారి దాడిచేయబోగా యువకులు అడ్డుకున్నారు. వారిపై కూడా కొడవలితో దాడికి పాల్పడింది. యువకులు గాయపడిన పిల్లలు, అనసూయమ్మను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

• మట్టిని తవ్వి.. అక్రమంగా తరలిస్తూ

ప్రకృతి సిద్ధంగా లభించిన మట్టిని కూటమి నేతల అండతో జేసీబీలు, ఇటాచీలతో తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. లక్షల రూపాయల మట్టి దోపిడీ చేస్తున్న వారిని అధికారులు నిలువరించలేకపోతున్నారు. సంబేపల్లి మండలం గుట్టపల్లె వద్ద పట్ట పగలే ఇలా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. గురువారం మట్టి రవాణాను అడ్డుకున్నట్లు స్థానికులు తెలిపారు. అక్రమంగా మట్టి తరలించేవారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు. – సంబేపల్లి



వెదురు మొక్కల పెంపకం


మొక్కలు నాటుతున్న డీఆర్ఓ మధుసూదనరావు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో డీఆర్వో మధుసూదనరావు గురువారం వెదురు మొక్కలు నాటారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా జరగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంచడానికి ఏటా సెప్టెంబరు 18న ప్రపంచ వెదురు దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లు తెలిపారు. అంతకు ముందుగా మేదరి వెదురు వృత్తిదారుల సంక్షేమం, అభివృద్ధి సంస్థ నాయకులు రాయితీపై వెదురు ఇవ్వాలని, రాయచోటిలో వెదురు క్లస్టర్ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాయచోటి మున్సిపాలిటీ, తహసీల్దార్, రహదారులు, భవనాల శాఖ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద వెదురు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గజపనేని రెడ్డయ్య, గజపనేని వెంకటసుబ్బయ్య, ఆర్ల నాగరాజు, టంగుటూరి నాగార్జున, గజపనేని వెంకట జయప్రసాద్, నరసింహులు, ఎల్లయ్య, వెంకటా చలపతి, కోలే గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రిషివాటికకు నోటీసు

బి.కొత్తకోట : మండలంలోని గట్టు గ్రామంలో నిర్వహిస్తున్న రిషి వాటిక గురుకులానికి స్థానిక ఎంఈఓ రెడ్డి శేఖర్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా హోం స్కూలింగ్ నిర్వహిస్తున్నారని దీనికి వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు అందజేస్తామని గురుకుల యజమాన్యం తెలియజేసిందని ఎంఈఓ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


లారీని ఢీకొన్న కారు

కేవీపల్లి : రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కలికిరివాండ్లపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. హైదరాబాద్ నుంచి అరుణాచలానికి వెళ్తున్న కారు గురువారం కలికిరివాండ్లపల్లె సమీపంలో ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఈశ్వర్(26), గణేష్ (27), మహేష్‌బాబు (28), గౌతం (27), మహేంద్ర (27)లను చికిత్సనిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈశ్వర్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేవీపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి


జయసింహ (ఫైల్)

నందలూరు : మండలంలోని అరవపల్లి గ్రామానికి చెందిన కాశీగారి జయసింహ(26) గురువారం సాయంత్రం రైలు కింద పడి మృతిచెందారు. మృతుడి బంధువుల కథనం మేరకు.. కాశిగారి పెంచలయ్య, సరస్వతి దంపతుల కుమారుడు జయసింహ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి నిమిత్తం బెంగళూరుకు వెళ్లి మూడు రోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చిన ఆ యువకుడు కాలకృత్యాలు తీర్చుకోవాలని వెళ్లాడు. రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు కిందపడి మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు


పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ గుణశేఖర్

వీరబల్లి : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు పంపిణీ చేస్తోందని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. మండలంలోని మట్లి గ్రాంమలోని బోడిమల్ రెడ్డిగారిపల్లి వద్ద గురువారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గుణశేఖర్ పిళ్లై మాట్లాడుతూ అక్టోబరు 15వ తేదీలోగా వీరబల్లి పశువైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి టీకాల కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.